


**జరిగిన కథ :** కాశీలో చదువుకున్న ఏడుగురు మిత్రులు.. భోజరాజు వద్దకు ఉద్యోగం కోసం వెళ్తున్నారు. వారి ప్రయాణంలో భాగంగా.. మొదటివాడైన దత్తకుడు యక్షుని శాపం వల్ల స్త్రీగా మారాడు. అతణ్ని భోజరాజు కుమారుడు ప్రేమించాడు. రెండోవాడైన గోణికాపుత్రుడు యువరాజు దగ్గరే కొలువు సంపాదించాడు. మూడోవాడైన సువర్ణనాభుడు.. ఒక గాయని అయిన యక్షిణిని పెళ్లాడి మిత్రులను కలుసుకున్నాడు. ఇక నాలుగో మిత్రుని కథ ఇది.



# సిద్ధయోగి స్వీయచరిత్ర

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

కుచుమారుడు పాపం చాలా సుకుమారుడు. అతనికి మహారణ్యాలలో సంచరించి ఓషధీలతల విశేషాలు కనుగొనాలని చాలా ఉబలాటం. కానీ సువర్ణనాభుడిలా ధైర్యం చేసి అటవీమార్గంలో ఎక్కువ రోజులు ప్రయాణం చేయలేకపోయాడు. ఫలితంగా వెనుదిరిగాడు. కాశీపురానికి తిరిగి వస్తూ ఆ అడవిలో దారితప్పాడు. చాలాకష్టాలు పడ్డ తర్వాత ఒక కోయగూడేనికి వెళ్లగలిగాడు. గూడెపు పెద్దను కలుసుకుని..

''నీకు కాశీపురానికి దారి తెలుసునా?'' అని అడిగాడు.

''కాశీ అని మా పెద్దలు చెప్పడమే సామీ! పుణ్యం చేసినవారు చచ్చిన తరువాత అక్కడికి వెళతారని చెబుతారు'' అని చెప్పాడా పెద్ద.

''అయ్యో! పుణ్యం చేసుకుంటే చచ్చిన తరువాత పోయేది స్వర్గమయ్యా నాయనా! అది పైనుంటుంది. కాశీపురం మన భూమ్మీదే ఉంది. సరే కానీ, మీ అడవిలో ఆశ్చర్యకరమైన విశేషాలేమైనా ఉన్నాయా?'' అని ప్రశ్నించాడు కుచుమారుడు.

''లేకేం సామీ! ఇక్కడికి పదిదినాల పయనంలో పడమరగా ఒక రుషిగోరు ఉంటాడు. ఆయనకు ఎన్నేళ్లుంటాయో ఎవరూ చెప్పలేరు. పులులు, సింహాలు కూడా ఆయన ముందు సాగిలపడతాయి. ఆయన చెప్పినట్లు నడుచుకుంటాయి. ఆయన దగ్గరికి వెళ్లేవారిని కూడా జంతువులు బాధపెట్టవు. ఎప్పుడైనా మా గూడెంలో ఎవరికైనా కష్టం వచ్చిందంటే ఆయన పేరు చెప్పి ముడుపులు కట్టుకుంటాం. ఆపద గట్టెక్కిన తరువాత ఆ ముడుపులు తీసుకుని ఆయన దగ్గరికి పోతాం. కానీ ఆయన వాటిని తీసుకోడు. ఎప్పుడు చూసినా తన గుడిసెలో ముక్కుమూసుకుని ఉంటాడు'' అని చెప్పాడు.

కుచుమారుడు ఉత్సాహంతో అతడు చెప్పినదంతా విన్నాడు.

''నువ్వు ఆయనను ఎరుగుదువా?! ఆయన ఇప్పుడు ఉన్నాడా?'' అని అడిగాడు.

''తెలియదు సామీ! మా గూడెం నుంచి ఏడాదికాలంగా మేమెవరం ఆయన దగ్గరికి పోలేదు'' అని చెప్పాడు పెద్ద.

అతని దగ్గరనుంచి గుర్తులు అడిగి తెలుసుకుని, కుచుమారుడు ఒంటరిగా బయల్దేరాడు. పది దినాల పాటు ప్రయాణించాడు. గూడెం పెద్ద గుర్తులు చెప్పిన వనంలోకి ప్రవేశించాడు. అక్కడ వృక్షాలు, లతలు ఎండిపోయి ఉన్నాయి. పూలు పూయడం లేదు. పళ్లు కనిపించడం లేదు. దానిని చూసిన వారికి.. ఆ వనం పూర్వం చాలా శోభాయమానంగా ఉండేదని తోచక మానదు. గూడెం పెద్ద చెప్పిన ఆనవాళ్లను బట్టి ఒక తటాకం దగ్గరికి వెళ్లాడు. ఆ తటాకానికి మనోహరమైన సోపానాలు ఉన్నాయి. కానీ, నీరు వనరెక్కి నాచు పట్టింది. మెట్లు పాడుబడ్డాయి. పద్మాలు లేవు. సారహీనమై కనిపించిన ఆ తటాకాన్ని చూసి, దానికి తూర్పుదిక్కుగా కనిపిస్తున్న మర్రిచెట్టు ఆ సిద్ధుని తపోభూమి కావచ్చని అక్కడికి వెళ్లాడు.

ఆ చెట్టుకింద ఒక పర్ణశాల ఉంది. అది కూడా కళాహీనంగానే ఉంది. కృష్ణాజినం చివికిపోయింది. కమండలువు శకలాలై పడి ఉంది. ఆ సిద్ధుడు పరమపదించి ఉంటాడని అప్పటికి నిశ్చయానికి వచ్చాడు కుచుమారుడు.

కొంతసేపు ఆ చెట్టుకింద కూర్చొని ధ్యానంలో గడిపాడు. ఆ తరువాత ఆ చెట్టుపైకెక్కి వనమంతా పరికించి చూడాలనిపించింది. సగం వరకు ఎక్కేసరికి అక్కడో పక్షిగూడు లాంటిది కనిపించింది. కానీ, దానికి బిరడా మూత ఉండటం గమనించి దానిని ఊడలాగాడు. లోపల ఒక తాటియాకుల పుస్తకం దొరికింది.

చెట్టుదిగి వచ్చి, ఆ పుస్తకాన్ని చదవడానికి ప్రయత్నించాడు. కానీ అక్షరాలు అలుక్కుపోయి కనిపించాయి. ఆకుపసరు తెచ్చి ఆ ఆకులకు పూస్తే, అక్షరాలు స్పష్టంగా కనిపించి, వాటిని చదవగలిగాడు. మొదటి పుటపై 'సిద్ధుని స్వీయచరిత్రము' అని శీర్షిక కనిపించింది.

ఆసక్తిగా లోపలి పుటలు తిప్పి చూశాడు.

అందులో ఇలా ఉంది.

* * *

గోదావరీ తీరంలో పర్ణశాల అనే అగ్రహారం ఉంది. అందులో శ్రీధరభట్టు అనే బ్రాహ్మణుడికి పెద్దవయసులో మహీధరభట్టు అనే కుమారుడు పుట్టాడు. ఆ బాలుడు ఎనిమిదేళ్ల ప్రాయంలో 'నామలింగానుశాసనం' అని మరోపేరున్న అమరకోశం చదువుకున్నాడు. దాంట్లో అష్టసిద్ధులను వివరించే శ్లోకాన్ని కంఠతా పట్టాడు.

తన గురువును, తానెరిగిన పండితులను ఆ శ్లోకాన్ని వివరించమని పదేపదే కోరుతుండేవాడు. ఇలా ఉండగా